స్కెచ్

# ఏటి కెదురీత

"హితశ్రీ"

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థితిపరుడైన సుబ్బారావు తన మాగాణీ భూములన్నీ అమ్మేశాడు. దీనికి కారణం తలో విధంగా ఊహించారు. లోగుట్టు పెరుమాళ్ళకెరుక అన్నట్టు సుబ్బారావుకి ఆస్తికి మించిన అప్పుంది కాబోలునని కొంతమందీ, ఏదో పెద్దయెత్తున వ్యాపారం సాగిస్తాడని కొంతమందీ, యుద్ధం ఐపోయిందికనుక ధరలు పడిపోతాయని ముందుగానే జాగ్రత్తపడ్డాడని మరికొంతమందీ తమ బుద్ధిబలం ఉపయోగించి ఊహించి కారణం గ్రహించామనుకున్నారు. కాని వీళ్లంతా వాస్తవానికి యోజనాల దూరంలో ఉన్నారు. సుబ్బారావు యోచనాపరుడు. ముందుచూపుకలవాడు. "ఈరోజు హాయిగా ఉంటే ఇంకారాని రేపటి చింతెందు" కనే ఉమర్ ఖయ్యాం వాదానికి సుబ్బారావు పరమ విరోధి.

"ఏమోయ్, సుబ్బారావ్. భూములన్నీ అమ్మావు టెందుకు?' అని అడిగాను ఓరోజు సాయంత్రం పార్కులో కనిపిస్తే.

"కాంగ్రెస్ ప్రభుత్వం హయాంగదా ఇది" అన్నాడు.

"అయితే?"

"చూస్తూఉండు తెలుస్తుంది. నువ్వు నేను చేసినపనిని మెచ్చుకొనేరోజు ఎంతో దూరంలో లేదు."

"ఏమిటీ నీ అభిప్రాయం?"

"దున్నేవాడిదే భూమి అనే నినాదం వినలేదా?"

"విన్నాను. కాని—"

"ఇవాళకాకపోతే రేపైనా అది అమల్లోకి రాకతప్పదు. రాబోయే మార్పులు గ్రహించి ముందే జాగ్రత్తపడటం బుద్ధిమంతుల లక్షణం. తర్వాత, ఒకవేళ నష్టపరిహారం ఇచ్చినా ఇప్పటి ధరలు గిట్టవు. ఏమంటావ్?" చిరునవ్వుతో చూశాడు నావైపు. తెలివిగల వనే అనిపించింది నాకు. తలూపాను.

పొలం అమ్మిన డబ్బంతా బ్యాంకుల్లో వేశాడు సుబ్బారావు. "ఏదో ఒక్క బ్యాంకులోనే ఉన్న డబ్బంతా వేస్తే తర్వాత ఏమనుకున్నా ఏంలాభం?" అన్నాడు. "ఒక మనిషికి ఒకే బ్యాంకు అనే నియమం ఉంటేకాని బ్యాంకులు బాగా అభివృద్ధి పొందవని పుస్తకాల్లో రాశారు గదా, మరి చదువుకున్నవాడివి, నువ్వే ఇలా చేస్తే ఎలా" అని అడిగితే, "అదంతా థియరీ" అని నవ్వాడు.

ఒకటిన్నర సంవత్సరం గడిచింది. ఓ శుభోదయాన సుబ్బారావు నా బసకి వచ్చాడు. "ఏమిటి సంగతి?" అన్నాను. క్రాసు చేసిన చెక్కొకటి నా చేతి కిస్తూ, "ఇది కాస్త మార్చిపెట్టాలోయ్" అన్నాడు. నా కాశ్చర్యం వేసింది.

"అన్ని బ్యాంకుల్లో అకౌంట్లూ, డిపాజిట్లూ ఉన్నవాడివి - నీకు నేను చెక్కు మార్చిపెట్టటమేమిటి?"

"అన్నీ తీసేశాను. ఇప్పుడేమీ లేవు."

"ఆఁ—"

"అలా నోరు తెరుస్తావేమిటి? ఇందులో ఆశ్చర్యపడేందుకేముంది?"

"ఎందుకు తీసేసినట్టు?"

"ఇన్ ఫ్లేషన్—"

"అయితే—?"

"నువ్వు పేపరు చదవ్వా ఏమిటి?"

"ఏమిటి నీ భావం?"

"ఇన్ ఫ్లేషన్ ఎంత తీవ్రంగా ఉందో తెలుసా? మామూలు పరిస్థితికి రావటానికి ప్రభుత్వం తప్పక తీవ్రమైన చర్యలు తీసుకుంటుంది. బ్యాంకు డిపాజిట్లు స్తంభింప చేయరనటానికి ఆధారా లేమిటి?"

"అది అసామాన్య విషయం"

"అసంభవం కాదుగా? దృష్టాంతాలు కావాలా!"

సుబ్బారావు ఆర్థిక శాస్త్రంలో ఎం. ఎ. ప్యాసయాడు. ఇహ అతనితో ఏం వాదించేది?

"అయితే అకౌంట్లన్నీ తీసేశా వన్న మాట."

"ఆహా."

"మరి డబ్బంతా ఏం చేశావు?"

"బంగారంలోకి మార్చాను."

"ఇంత ఖరీదులో బంగారం కొన్నావా?"

"అవును. కరెన్సీ కాగితాలు ఎప్పటికైనా ప్రమాదకరమే. బంగారమయితే పడి ఉంటుంది."

"వడ్డీ నష్టం కాదా?"

"వడ్డీకి చూసుకుంటే అసలుకే ఎసరు వస్తుంది."

సుబ్బారావుని చూస్తే నాకు నిజంగా జాలి వేసింది. ఈ మనిషి కింత తాపత్రయం ఎందుకో?

"బంగారం ప్రాముఖ్యం ఏమిటి?"

"మారకానికి అందరూ ఒప్పుకున్న లోహం కదా."

"మనం ఒప్పుకుంటేనే కదా దాని ప్రాముఖ్యం."

"ఏమిటి నీ ఉద్దేశం?"

"ముందుముందు బంగారానికి బదులు మరో లోహం దానిస్థానే ఉపయోగించబడదని ఎవరు చెప్పగలరు?"

"నీకు మతిపోయిందా? అలా ఎప్పటికీ జరగదు."

"ఎందుకు జరగకూడదని నా ప్రశ్న. బంగారంకంటె విలువగల లోహాలు కనిపెట్టబడుతున్నాయట తెలుసా?"

"ఏమైనా - అలా ఎందుకు జరుగుతుంది?" గొణిగాడు సుబ్బారావు.

"నువ్వు ముందుకు తొంగిచూస్తున్నావు. నేను మరి కొంచెం ముందుకు చూస్తున్నాను. అంతే భేదం."

సుబ్బారావు నావంక అనుమానంగా చూసి అన్నాడు: "నేను ముందు ఎప్పుడో జరిగేది ఇప్పుడే ఆలోచిస్తానని గేలిచేస్తున్నావు - అర్థమయింది. కాని ఓరోజు నువ్వు నన్ను మెచ్చుకోక తప్పదు, చూస్తూఉండు."

"ముందు చూపుండటం మంచిదే. కాని నువ్వు కాలాన్ని మోసగించాలని ప్రయత్నిస్తున్నావు. మోసగింపబడుతున్నావేమోనని భయంగా ఉంది."

"ఈ జబ్బు నీకూడా ఉంది?" నా వంక తేరిపారచూసి అన్నాడు. సుబ్బారావు ఉద్దేశమేమిటో నా కర్థం కాలేదు. బహుశా కాలం మీద పద్యాలు రాసేవాళ్ళలో ఒకణ్ణిగా భావించాడేమో.

* * *

నే నుండే ఇల్లు ఖాళీచేయవలసి వచ్చింది. ఎక్కడో ఖాళీభాగం ఉందంటే చూట్టానికి వెళ్ళాను. లోపలికి వెడుతుంటే గుమ్మంలో సుబ్బారావు కనిపించాడు.

"ఇక్కడ తారసిల్లావేమిటి కథ?" అన్నాను.

"అద్దె వసూలు చేసికోటానికి."

అద్దె! నాకు తెలిసినంతవరకూ సుబ్బారావుకి ఒకటే ఇల్లు. ఇది కాదు.

"అలా చూస్తా వేమిటి? ఈ ఇల్లు కొన్నాను."

"అలాగా? ఇక్కడేదో ఖాళీ ఉందంటే వచ్చాను. ఇప్పుడుంటున్న ఇల్లు ఖాళీ చేయాలి." అని ఆశగా చూశాను.

"అరె! ఇప్పుడే ఎవరో వచ్చిచేరారు. ఒక్క రోజు ముందు తెలిస్తే బావుండేదే." అని నొచ్చుకున్నాడు.

"అసలీ ఇల్లెప్పుడు కొన్నావు?"

"ఈ మధ్యే. ఈ రోజుల్లో ఇంట్లో ఉంచుకోటం అంత శ్రేయం కాదు. చరాస్తి అన్నప్పుడల్లా మంచి కాదు. పరిస్థితు లంత బాగా లేవు. ఈ కమ్యూనిస్టు ఉపద్రవాలూ అవీ చూస్తుంటే అరాచకం ప్రబలుతుందేమోనని అనుమానంగా ఉంది. అంచేత బంగారమంతా ఏదో కాడికమ్మేసి ఇళ్లు కొనేశాను. అద్దెలు ఎక్కువగా ఉన్నాయి ఆదాయంకూడా పెరుగుతుంది. ఏమంటావ్?" అన్నాడు గుక్క తిప్పుకోకుండా.

"భేషుగ్గా ఉంది" అన్నాను. అంతకంటె ఏమీ అనదలుచుకోలేదు.

ఈ సంఘటన జరిగిన కొన్నాళ్ళ తర్వాత ఓ రోజు పత్రికలో చూశాను. ఇళ్లు అమ్మకానికి ఉన్నాయని సుబ్బారావు ప్రకటన చేశాడు. అడిగితే అన్నాడు:

"ఈరోజుల్లో ఇల్లు లేకపోవటం ఎంత ఇబ్బందో అద్దె ఇళ్ళ స్వంతదార్లు కావటం అంతకంటె ఎన్నోరెట్లు బాధాకరం–కారణాలు వేరే చెప్పటం అనవసరం. అంచేత ఎలాగో ఈ ఇళ్ళని వదిలించుకోవాలని చూస్తున్నాను. అదికాక ఇళ్ళ ధరలు తగ్గిపోతున్నాయి. ఈ ధరలుకూడా నిలుస్తాయని నమ్మకంలేదు. సాధ్యమైనంతవరకు నష్టాన్ని తగ్గించుకోవడం ఉత్తమం. పకాస్ బిల్డింగ్ సొసైటీలు పెద్దపెద్ద ప్లానులు వేస్తున్నాయి. ఆ ఇళ్లు తయారయాయంటే వీటిమొహం మెవరు చూస్తారు? ఏమంటావ్?"

చేసేదంతా చేస్తూ ఏమంటావని నన్నడగట మెందుకు, వద్దంటే మానేస్తావు గనకనా?" అన్నాను చిరాకుగా.

"అది కాదు. నేను చేసేది సబబుగా లేదంటావా?"

"ఏమో. అయినా నీకంటె నా కెక్కువేం తెలుసు. అర్థశాస్త్రంలో పట్టా పొందినవాడివి వామె."

"ఈ ఇళ్ళు నమ్మిన డబ్బుతో ఏదైనా చిన్న పరిశ్రమ స్థాపిద్దామని ఉంది."

"అవశ్యం–కాని దీంట్లో ఓచిక్కున్నట్టుంది. పరిశ్రమలన్నీ ప్రభుత్వం జాతీయం చేస్తుందేమో. నష్టపరిహారం ఇచ్చినా నామమాత్రంగానే ఉంటుందేమో" అన్నాను బలవంతాన నవ్వాపుకుంటూ. ఆలోచిస్తున్న కళ్ళతో సుబ్బారావు నావైపు చూశాడు.

* * *

తనడబ్బు క్షేమంగా ఉండే పద్ధతులింకా ఏవేవో ఆలోచించి ఆచరణలో పెట్టాడు సుబ్బారావు. కాని ఏవిధానా తృప్తికలగలేదు. రానురాను అతడిధనం తగ్గిపోయింది. ప్రతి విధానంలోనూ అతడికి ధనక్షయంసంభవించింది. ప్రాణం విసిగి చివరికి మిగిలిన డబ్బుతో సుబ్బారావు పదెకరాల పొలం కొని స్వయం వ్యవసాయం ప్రారంభించాడు. ఆపొలం ఇదివర కతడమ్మిందే. తక్కువ ధర కమ్ముకున్న పొలాన్నే మళ్ళీ ఎక్కువ ధర యిచ్చి కొన్న సుబ్బారావుని చూస్తే జాలివేసింది.

"రోజులు మంచివి కావు. నే నేపని చేసినా చెడిపోతోంది." అన్నాడు సుబ్బారావు.

"ఓసారి చెప్పాను, జ్ఞాపకం ఉందా? కాలాన్ని మోసగించాలని ప్రయత్నించావు. మోసగింపబడ్డావు." సుబ్బారావు మాట్లాడలేదు.

"కాలంతో పరిగెత్తలేక పోయావు. మార్పును ఆహ్వానించలేకపోగా తప్పించుకోవాలని చూశావు. అంచేత కాలం నీమీదే ముందుగా తన ప్రభావం చూపించింది. నీ ఎకరాలు ఎల్లకాలమూ నీకే ఉండాలంటే ఎలా?"


"నిజమే. కాలాన్ని ఓడిద్దామని ప్రయత్నించాను. గెలుస్తున్నా ననుకున్నాను. ఓడిపోయేదాకా తెలిసికోలేక పోయాను."

"మార్పు ననుసరించి నువ్వు మారలేకపోయినా మార్పును ఎదిరించటానికి ప్రయత్నించకపోతే అప్పుడే ఈస్థితికి వొచ్చేవాడివి కాదేమో. కనీసం మనశ్శాంతి అయినా ఉండేది."

బరువుగా నిశ్వసించాడు సుబ్బారావు. అంతకంటె ఏం చేయగలడు?


# ది ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

హెడ్డాఫీసు : మదరాసు

(Estd:  1907)

జారీచేసి చందావేయబడిన

| | |
|---|---|
| మూలధనం | రూ. 72,00,000 |
| అడిగిన మూలధనం | రూ. 53,00,000 |
| రిజర్వ్ ఫండ్ | రూ. 62,00,000 |

అన్నిరకాల బ్యాంకింగ్ వ్యవహారాలూ చేయబడును.

యస్. గోపాల అయ్యర్,
కార్యదర్శి.